ప్రజాశక్తి

శనివారం 6 డిసెంబర్ 2025 5 విజయనగరం

బాలికపై అత్యాచారయత్నం

కేసు నమోదు చేసిన పోలీసులు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

బాలికపై అత్యాచారం యత్నం ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 2న విజయనగరం బిసి కాలనీ ప్రాంతానికి చెందిన ఓ బాలిక (17)ను అయ్యన్నపేట ప్రాంతానికి చెందిన మజ్జి కృష్ణ ప్రసాద్ (21) అనే యువకుడు విటి అగ్రహారం డిమార్ట్ వద్ద మాయ మాటలు చెప్పి నెల్లిమర్ల శివారు సారిపల్లి టిడ్కో కాలనీకి తీసుకొచ్చి ఓ ఇంటిలో అత్యాచారం యత్నం చేసినట్లు తెలిసింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నెల్లిమర్ల పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటనపై ఎస్ఐ బి.గణేష్ మాట్లాడుతూ సారిపల్లి టిడ్కో కాలనీ సి2 బ్లాక్‌లోని ఓ గృహంలో ఈ సంఘటన జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఈ సంఘటనపై విచారణ చేస్తున్నారు. ఆ బ్లాక్ లోని ఇళ్లన్నీ ఖాళీగా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. నిందితుడు జిల్లా కేంద్రానికి చెందిన ఓ కానిస్టేబుల్ కుమారుడని తెలిసింది. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై గణేష్ తెలిపారు.

> "ఒకప్పుడు పిల్లలు భారం అనుకునేవారు... కానీ ఇప్పుడు పిల్లలే ఆస్తి. పిల్లలే శ్రీరామ రక్ష. పిల్లలే భవిష్యత్తు. మధ్యాహ్న భోజనం నుంచి స్టూడెంట్ కిట్స్ వరకు నాణ్యత పెంచాం. మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా, నాణ్యతతో అందిస్తున్నాం. విలువలతో కూడిన సమాజాన్ని అందించాలనే ఉద్దేశంతో పని చేస్తున్నాం. గతంలో టీచర్లకు చాలా యాప్‌లు ఉండేవి. ఇప్పుడు అలాంటి ఇబ్బందులు తొలగించాం. శనివారం నో బ్యాగ్ డే.. ఆడుతూ పాడుతూ విద్యార్థులకు నచ్చిన పని చేస్తున్నాం. ఇష్టంతో తక్కువ సమయం చదివినా రాణిస్తారు. చదువులో వెనకబడ్డ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. షైనింగ్ స్టార్స్ పేరుతో ప్రతిభా అవార్డులు ఇస్తున్నాం. విద్యలో నాణ్యతా ప్రమాణాలను పరిశీలించేందుకు క్విజ్ అప్రోచ్ ద్వారా ప్రయత్నిస్తున్నాం. సామాజిక బాధ్యతగా డ్రగ్స్ వ్యతిరేక ప్రచారాన్ని ముమ్మరంగా చేపట్టే బాధ్యత విద్యార్థులకు ఉంది."
>
> - మెగా పిటిఎంలో సిఎం చంద్రబాబు

మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలి

- ప్రయివేట్ కంటే ప్రభుత్వ స్కూళ్లలోని టీచర్లే బెస్ట్
- మెగా పిటిఎంలో సిఎం చంద్రబాబు
- భామిని ఎపి మోడల్ స్కూల్‌ను పరిశీలించి, విద్యార్థులతో ముచ్చటించిన సిఎం

ప్రజాశక్తి - పార్వతీపురం/భామిని

ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను గుర్తించి, వారిని మట్టిలో మాణిక్యాలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల కంటే ప్రభుత్వ ఉపాధ్యాయులే మంచి నైపుణ్యం కలిగి ఉన్నారని, కావున విద్యార్థులు బాగా చదువుకొని అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. భామిని మండలంలోని ఎపి మోడల్ హైస్కూల్లో శుక్రవారం జరిగిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌లో ముఖ్యమంత్రితో పాటు విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. భామిని చేరుకున్న సిఎంకు అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. తొలుత పాఠశాలలో స్పోర్ట్స్ రూమ్, స్కిల్ ల్యాబ్‌లను పరిశీలించారు. క్లాస్ రూమ్ టీచింగ్‌ను విద్యార్థులతో కలసి కూర్చొని విన్నారు. కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కూర్చొని విద్యార్థుల ప్రొగ్రెస్ రిపోర్టులను చంద్రబాబు, లోకేష్ అడిగి తెలుసుకున్నారు. విద్యలో పిల్లల బలాబలాలు తెలుసుకునేందుకు అందుకు అనుగుణంగా విశ్లేషించుకుని స్కై, మౌంటెన్, స్ట్రీమ్ అనే మూడు రకాలుగా వర్గీకరించామని, క్లిక్కర్ అనే విధానం పిల్లలను మరింత ఆసక్తిగా చదువుకునేలా చేస్తోందని చంద్రబాబుకు లోకేష్ వివరించారు. ఎప్పటికప్పుడు పిల్లల చదువును విశ్లేషించేలా క్లిక్కర్ బాగా పని చేస్తోందన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడారు. రాబోయే కాలంలో విద్యా వ్యవస్థలో ఎవరూ ఊహించని ఫలితాలు వస్తాయని, దీనికి అంతా సహకరించాలని కోరారు. పిల్లలను సానబెడితే అద్భుతాలు సాధిస్తారన్నారు. ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన అంధ క్రీడాకారిణి కరుణ కుమారి ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని అంధ మహిళల క్రికెట్ ప్రపంచ కప్‌ను సాధించిందన్నారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువులను గౌరవించే విద్యావిధానం అమలుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. స్త్రీ,పురుష సమానత్వం రావాలని కోరారు. ఇంటి పనుల్లో మహిళలకు పురుషులు సహకరించాలని సూచించారు. విద్యారంగంలో సమూలంగా మార్పులు తీసుకురావడానికి ఉపాధ్యాయులను ఫిన్‌లాండ్ లాంటి దేశాలకు అధ్యయనం కోసం పంపుతామన్నారు. ఇటీవల విద్యార్థులతో మాక్ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించగా వారిలోని నైపుణ్యతను వెలికి తీసినట్లు చెప్పారు. పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గంలో తోటపల్లి ఎడమ కాలువ నిర్మాణం, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని కోరారు. ఎమ్మెల్యే చెప్పిన తోటపల్లి ఎడమ కాలువ నిర్మాణం, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. వంశధార, పోలవరం అనుసంధానం చేస్తామని చెప్పారు. సభ అనంతరం విద్యార్థులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కోన శశిధర్, పాఠశాల విద్య కమిషనర్ విజయకుమార్ రాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్ ప్రభాకర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవర్ జగన్నాథ్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

మెగా పిటిఎంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబునాయుడు

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్

విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనను పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు

విద్యే మనిషికి అసలైన ఆభరణం

మెగా పిటిఎంలో మంత్రి కొండపల్లి

ప్రజాశక్తి-గజపతినగరం

వినయం, విధేయత, సత్య పూర్వకమైన ఆలోచనతో పాటు విద్య మనిషికి అసలైన ఆభరణాలని, అటువంటి లక్షణాలతో కూడిన విద్యను అందించేవి ప్రభుత్వ విద్యాలయాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గజపతినగరంలోని ప్రభుత్వ విద్యాలయాల ఆవరణలో శుక్రవారం సర్వ శిక్ష అభియాన్ ఎపిసి రామారావు అధ్యక్షతన జరిగిన మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీట్ కు మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి పాలన ప్రారంభమైన తర్వాత విద్యావ్యవస్థలో సమూలమైన మార్పులకు శ్రీకారం చుట్టామని, ఫలితంగా ఈ ఏడాది కాలంలో విద్యాలయాల్లో కొంత మార్పు కనిపిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే ప్రభుత్వ పథకాల ఫలాలు సామాన్యుడికి చేరినప్పుడే అసలైన లక్ష్యం సిద్ధిస్తుందని అన్నారు. పిల్లల ఆలోచన శక్తిని అంచనా వేయగలిగేది తల్లిదండ్రులు మాత్రమేనని, తల్లిదండ్రులు విద్యార్థుల పురోగతిపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని మంత్రి చెప్పారు. చదువే అభివృద్ధికి అసలైన మూలమని, మానవ ప్రగతి విద్యతోనే సాధ్యమని అన్నారు. ఈ విద్యాలయాలకు అవసరమైన తరగతి గదులను వివిధ సంస్థల నుంచి వచ్చే సి ఎస్ ఆర్ ఫండ్స్ ద్వారా నిర్మించాలని నిర్ణయించామని, అందులో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 12 తరగతి గదులు, జూనియర్ కళాశాలకు 6 తరగతి గదులు, డిగ్రీ కళాశాలకు మరో 12 తరగతి గదులను నిర్మించేందుకు అవసరమైన కార్యాచరణతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. రాబోయే రెండేళ్లలో ఈ మొత్తం 30 తరగతి గదులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఎపిసి రామారావు మాట్లాడుతూ డొక్కా సీతమ్మ ఉచిత భోజన పథకం, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమం తో పాటు విద్యాశాఖ చేపడుతున్న అన్ని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటున్నాయని చెప్పారు. ఈ సమావేశానికి ముందుగా విద్యార్థులకు విద్యా బోధన చేసేందుకు అవసరమైన టీచింగ్ అండ్ లెర్నింగ్ మెటీరియల్‌ను మంత్రి పరిశీలించారు. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పాఠ్య పుస్తకాలు, క్రీడా పరికరాలు, ఆటవస్తులు చిత్రలేఖన ప్రదర్శన, ప్రయోగశాలలో ఏర్పాటు చేసిన పరికరాలను మంత్రి పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు అనంతరం విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులు విలువలతో కూడిన విద్య ప్రాముఖ్యాన్ని తెలియజేస్తూ ప్రదర్శించిన రూపకం అందరినీ ఆలోచింపజేసింది. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ పివివి గోపాలరాజు, పిఎసిఎస్ చైర్మన్ లెంక బంగారు నాయుడు, టిడిపి మండల అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. సత్యనారాయణ, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రకాష్ పట్నాయక్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు, ఎంఇఒలు యస్ విమలమ్మ, బి.సాయి చక్రధర్, టిడిపి నాయకులు శీరంరెడ్డి రాంకుమార్,వివి ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెగా పిటిఎంలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులతో మంత్రి శ్రీనివాస్

విలువలతో కూడిన విద్య అత్యంత ముఖ్యం : కలెక్టర్

గంట్యాడ : విద్యలో విలువలు, సమగ్రాభివృద్ధి అత్యంత ప్రధానమని కలెక్టర్ తెలిపారు. గంట్యాడ కెజిబివిలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్, టీచర్ మీట్‌లో కలెక్టర్ మాట్లాడారు. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహం అవసరమని చెప్పారు. ముందుగా కలెక్టర్ విద్యార్థుల స్థితిగతులను వారి తల్లిదండ్రులకు వివరించారు. తరగతి గదులను పరిశీలించి లేబోరేటరీని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఉపాధ్యాయుని అవతారం ఎత్తి ఫ్రాక్షన్, రిఫ్రాక్షన్ గురించి, కుంభాకార పుటాకార అద్దాల గురించి విద్యార్థులకు వివరించారు. కొన్ని కెమికల్స్‌ని చూపించి వాటి శాస్త్రీయ నామాలను విద్యార్థుల నుండి రాబట్టారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఓపికగా సమాధానాలిచ్చి వారిలో చైతన్యాన్ని, స్ఫూర్తిని నింపారు. కార్యక్రమంలో డిఇఒ మాణిక్యంనాయుడు, ఐసిడిఎస్ పీడీ విమల రాణి, ఎస్ఎంసి చైర్‌పర్సన్ డి.గౌరి, ప్రిన్సిపల్ జ్యోతి పాల్గొన్నారు.

ప్రదర్శనను పరిశీలిస్తున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

రైతులందరికీ 'సుఖీభవ' వర్తింప జేయాలి

వైసిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు

ప్రజాశక్తి -కంటోన్మెంట్

పది సెంట్లలోపు భూమి ఉన్న రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథఖాన్ని వర్తింపజేయాలని, చెరకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోనే అత్యధిక రైతులు ఉన్న జిల్లా విజయనగరమేనని, ఇక్కడ భూములు తక్కువగా ఉంటాయని, అందువల్ల అందరికీ అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలని అన్నారు. జిల్లాలో 40 వేల మంది రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి దూరమయ్యారన్నారు. జిల్లాలో చెరకు పరిశ్రమలైన భీమ సింగి , ఎన్ సి ఎస్ మూసివేసారని, ఉన్న ఒక్కగానొక్క సంకిలి షుగర్ ఫ్యాక్టరీని మూసివేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని అన్నారు. సంకిలి యాజమాన్యం మూడు లక్షల టన్నుల చెరకు లేకపోతే మిల్లు నడపలేమని తెలిపిందని, రైతులతో ఆ దిశగా చెరకు పంట వేయించడం లేదని, రైతుకు గిట్టుబాటు ధర కల్పించకపోవడం వల్లే ఈ పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు. జిల్లాలో ఉన్న రైతులు సమస్యలపై మంత్రులు ఎమ్మెల్యేలు మాట్లాడకపోవడం దురదృష్టకరమన్నారు. మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించడం లేదన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద మిల్లర్లే అధిక కేజీలు ధాన్యం డిమాండ్ చేస్తున్నారని ఫిర్యాదులు ఇన్చార్జి మంత్రికి వచ్చాయని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ పి.సురేష్‌బాబు, పార్లమెంటు పరిశీలకులు కిల్లి సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శులు నెక్కలి నాయుడు బాబు, కెవి సూర్యనారాయణ రాజు, భోగాపురం మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి లేని మండలాలకు మెమోలు

పనిదినాల కల్పనలో వెనుకబడిన మండలాలపై కలెక్టర్ అసహనం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

వంద రోజుల పని దినాల కల్పనలో ప్రగతి లేని మండలాలకు మెమోలు జారీ చేయాలని డ్వామా పీడీకి కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా వంద రోజుల పనిదినాల కల్పనపై మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. పనిదినాల కల్పనలో వెనుకబడిన కొన్ని మండలాల పనితీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వంగర, మెంటాడ, జామి, వేపాడ, కొత్తవలస మండలాలు ప్రతి వారం ప్రగతి తగ్గుతుండటం తీవ్రంగా పరిగణనలోకి తీసుకోవాలని పీడీని ఆదేశించారు. గుర్ల, విజయనగరం, ఎల్. కోట, రేగిడి ఆమదాలవలస, భోగాపురం మండలాలు కూడా నిర్దేశిత ప్రగతి సాధించకపోవడంతో, వెంటనే పనిని వేగవంతం చేసి పురోగతి సాధించాలని ఆదేశించారు. 100 రోజుల పని కల్పనలో ప్రగతి చూపని రాజాం, వంగర, తెర్లాం, కొత్తవలస, దత్తిరాజేరు మండలాల ఎపిడిలను, ఎంపిడిఒలను కలెక్టర్ హెచ్చరిస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేపాడ మండలంపై ప్రత్యేకంగా స్పందించిన కలెక్టర్, పనుల షెల్ఫ్ ముందుగా సిద్ధం చేయకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఎంఐ ట్యాంకులు తప్ప మిగతా పనులకు పరిపాలనా ఆమోదాలు తీసుకుని వెంటనే పని కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో నవంబర్ నెలలో సగటు వేతనం 284 రూపాయలు మాత్రమే చెల్లించారని, అన్ని మండలాల్లో రోజువారీ వేతనం రూ.300 కన్నా తక్కువ రాకుండా పనులు కల్పించాలని ఆదేశించారు. ముఖ్యంగా పూసపాటిరేగ, చీపురుపల్లి మండలాల్లో సగటు వేతనం తక్కువగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, వేతనదారులకు తగిన పనులు కల్పించాలని ఆదేశించారు.

కూరగాయల పెంపకంపై దృష్టి పెట్టాలి

విజయనగరం కోట : స్థానిక మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా కూరగాయల పెంపకాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి తెలిపారు. జిల్లాలో సీజనల్‌గా డిమాండ్ ఉన్నటువంటి కూరగాయలు, ఆకు కూరలు తదితర పంటల విస్తీర్ణాన్ని పెంచడంపై ఉద్యాన అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. తక్కువ పెట్టుబడి తో ఎక్కువ లాభాలు వచ్చే మార్గాలను అన్వేషించి రైతులకు అవగాహన కలిగించాలని తెలిపారు. కలెక్టర్ చాంబర్లో శుక్రవారం ఉద్యాన శాఖపై సమీక్షించారు. ప్రతి మండలంలో కనీసం వెయ్యి ఎకరాల్లో ఉద్యాన పంటల అభివృద్ధి జరగాలని సూచించారు. కూరగాయలు సాగు పెంచడానికి నీటి సదుపాయం లేని చోట రైతులతో సమావేశం ఏర్పాటు చేసి రుణాలు ఇప్పించి, కూరగాయల సాగు పెరిగే విధంగా చూడాలని తెలిపారు. దీనివల్ల రైతులు తమ ఆదాయాన్ని గణనీయంగా పెంచుకోవచ్చని చెప్పారు. సమావేశం లో ఉద్యానశాఖ ఉప సంచాలకులు కె.చిట్టిబాబు, ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న విఆర్ఎలు, నాయకులు

పేస్కేల్ అమలు చేయాలని విఆర్ఎల ధర్నా

ప్రజాశక్తి -కంటోన్మెంట్

విఆర్ఎలకు తక్షణమే పే స్కేలు అమలు చేయాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ వద్ద విఆర్ఎలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినా విఆర్ఎల సమస్యలు ఏ ఒక్కటీ పరిష్కరించలేదన్నారు. ఏడేళ్లగా ఒక్క రూపాయి కూడా జీతం పెరగలేదన్నారు. తెలంగాణలో పేస్కేల్ ఇచ్చి ప్రభుత్వం ఆదుకుందని, మన రాష్ట్రంలో కూడా పేస్కేలు అమలు చేయాలని కోరారు. అర్హులైన విఆర్ఎలకు ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. ఏళ్ల తరబడి నామినీలుగా పనిచేస్తున్న వారిని విఆర్ఎలుగా నియమించాలన్నారు. అటెండర్ నైట్ వాచ్మెన్ ప్రమోషన్ కోటాను 20 నుంచి 70 శాతానికి పెంచాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విఆర్ఎలకు వర్తింపచేయాలన్నారు. అక్రమ డ్యూటీని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.గురుమూర్తి, డిఆర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు

ఆ భూమిని లీజుకు ఇవ్వలేదు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి ఐటిఐ పక్కన ఉన్న పర్యాటక శాఖ భూమిని ఎవరికీ లీజుకు ఇవ్వలేదని ఆర్‌డిఒ రామ్మోహన్‌రావు స్పష్టంచేశారు. పర్యాటక శాఖకు చెందిన సర్వే నంబర్ 223-2లో భూమిని ప్రయివేటు వ్యక్తులకు అప్పగించారని, ఆ భూమి ప్రభుత్వ, ప్రజావసరాలకు ఉపయోగించాలని సిపిఎం నాయకులు సెప్టెంబర్ 9న కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో వినతి అందించారు. దీంతో తహశీల్దార్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆ భూమిని లీజుకు ఇవ్వలేదని ఆర్‌డిఒకు నివేదిక అందించారు. దీంతో ఇదే విషయాన్ని దరఖాస్తు చేసిన సిపిఎం నాయకులు పి.శంకరరావుకు ఆర్‌డిఒ తెలిపారు.

7న జాతీయ ఉపకార వేతన పరీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

2025-26 విద్యా సంవత్సరానికి జరగనున్న జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్ ఎం ఎం ఎస్) ఈనెల 7 ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు జరగనుంది. పరీక్ష కు జిల్లా విద్యా శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. పరీక్షకు హాజరవుతున్న విద్యార్థుల హాల్ టికెట్లను www.bse.ap.gov.in లోను, పాఠశాల లాగిన్ లోనూ, వాట్సాప్ మన మిత్ర యాప్ లోనూ అందుబాటులో ఉంచారు. పరీక్షకు జిల్లాలో మొత్తం 4094 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్ష నిర్వహణకు బొబ్బిలి, చీపురుపల్లి, విజయనగరంలో మొత్తం 19 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఉదయం 9గంటలకే కేంద్రాలకు చేరుకోవాలి.

మార్చి 2 నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మార్చి 2న ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ ప్రాక్టికల్, థియరీ పరీక్షలు జరగనున్నట్లు డిఇఒ యు.మాణిక్యం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ థియరీ పరీక్షలు మార్చి 2 తేదీ నుంచి 13 తేదీ వరకు, పదో తరగతి థియరీ పరీక్షలు మార్చి 16 నుంచి 28 వరకు, ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఏప్రిల్ 11 నుంచి 18 తేదీ వరకు జరగనున్నట్లు తెలిపారు. థియరీ పరీక్షలు అన్ని ఉదయం 9 గంటల నుంచి 12.30 గంటలు వరకు,ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని తెలిపారు.

ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ

సమస్యల పరిష్కారానికి అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం

బాడంగి.. ఎమ్మెల్యేకు వినతి అందిస్తున్న పాలవలస గౌరు

ప్రజాశక్తి-బాడంగి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే బేబినాయన నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి వినతులు వెల్లువలా వచ్చాయి. 88 మంది హాజరై తమ సమస్యలపై ఎమ్మెల్యేకు అర్జీలు అందజేశారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఎంఇఒ రాజేశ్వరి.. ఎంఆర్‌సి భవనం మరమ్మతుల కోసం ప్రజాదర్బార్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. గృహ నిర్మాణ అనుమతులు, రహదారులు, భూ సమస్యలు, పింఛన్ల మంజూరు, పంటనష్టం, నీటి సరఫరాలో లోపాలు, తదితర సమస్యలపై వినతులు అందాయి. అర్జీదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే ప్రత్యక్షంగా విని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలు పరిష్కారమయ్యే వరకూ కేసుల పురోగతిపై రోజువారీ సమీక్ష కొనసాగించాలని సూచించారు. అవసరమైన చోట వెంటనే క్షేత్రస్థాయి పరిశీలన చేసి, వాస్తవ పరిస్థితులను నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.

అన్యాయంగా పింఛన్లు నిలిపేశారు

ఎరుకులపాకలు గ్రామానికి చెందిన 11 మందికి గత వైసిపి ప్రభుత్వ హయాంలో అన్యాయంగా పింఛన్లు నిలిపేశారని గజరాయనివలస ఎంపిటిసి పాలవలస గౌరు... ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే బేబినాయనకు వినతి అందించారు. వైసిపికి ఓట్లు వేయలేదనే రాజకీయ కక్షతో నిరుపేదలకు పింఛన్లు నిలిపేశారని ఆయన వాపోయారు. 2006 నుంచి పింఛన్లు తీసుకుంటున్న వారికి 2022లో రద్దు చేయడం దారుణమని ఆవేదన వ్యక్తంచేశారు. అన్ని అర్హతలున్న పేద కుటుంబాలకు చెందిన వీరందరికీ పింఛన్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు.

రాజాం.. వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ఎమ్మెల్యే ప్రజాదర్బార్

రాజాం : రాజాంలోని టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ శుక్రవారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. 50కు పైగా వినతులు అందాయి. రెవెన్యూ, వీధిలైట్లు, కాలువలు, సిసి రోడ్లు, తదితర సమస్యలపై వినతులు అందాయి. అనంతరం శనివారం జిఎంఆర్ఐటిలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు.

శివమణికి పౌర సన్మానం

డ్రమ్స్‌తో యువతను ఉర్రూతలూగించిన శివమణి

ప్రజాశక్తి-విజయనగరంకోట

గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 103వ జయంతి సందర్భంగా ప్రపంచ ప్రసిద్ధ పర్కషన్ మాస్ట్రో పద్మశ్రీ శివమణికి ఘంటసాల స్మారక కళా పీఠం ఆధ్వర్యాన శుక్రవారం రాత్రి ఆనందగజపతి కళాక్షేత్రంలో పౌర సన్మానం చేశారు. ఆయనకు ఎమ్మెల్యే అదితి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, నిర్వాహకులు కంకణం తొడిగి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రపంచంలో నాకు దక్కే ప్రతి గౌరవం తన తల్లికి చెందుతుందని అన్నారు. నేటి రోజుల్లో పిల్లలకు సెల్ ఫోన్లు కంటే పుస్తకాలు ఇచ్చి చదివించాలన్నారు. మ్యూజిక్ మాస్ట్రో శివమణి తన శిష్యుడు పవన్ డ్రమ్స్‌తో లయ విన్యాసం చేసి శ్రోతలను ఉర్రూతలూగించారు. కార్యక్రమంలో ఘంటసాల స్మారక కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు ఎం. భీష్మారావు, అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి సర్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



శివమణిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే అదితి, డిప్యూటీ మేయర్ శ్రావణి

కేన్సర్ ఆస్పత్రిని సందర్శించిన హోం మంత్రి అనిత

ప్రజాశక్తి-కొత్తవలస

మంగళపాలెంలో గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ - డాక్టర్ విజయశ్రీ ఉప్పలపాటి మెమోరియల్ కేన్సర్ ఆస్పత్రిని హోంశాఖా మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ కేన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న పేదలకు అందిస్తున్న వైద్యసాయం ఎంతోమందికి స్ఫూర్తినిస్తోందన్నారు. పేదలకు అపరిమితమైన సేవలు అందిస్తున్న ఆస్పత్రికి ఆరోగ్యశ్రీ అనుమతి వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం వికలాంగులకు కృత్రిమ అవవయవాలు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ రాంపర్తి జగదీష్ కుమార్, విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ ఛైర్మన్ నారాయణ స్వామి, దాసరి కార్పొరేషన్ ఛైర్మన్ రత్నాజీ, కోళ్ల శ్రీను పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

రైల్వే వంతెనకు స్థల పరిశీలన చేస్తున్న ఆర్‌డిఒ రామ్మోహనరావు

రైల్వే వంతెనకు స్థల పరిశీలన

ప్రజాశక్తి-దత్తిరాజేరు

మండలంలోని కోమటిపల్లి రైల్వే గేట్ వద్ద వంతెన నిర్మాణం కోసం ఆర్‌డిఒ రామ్మోహన్‌రావు, రైల్వే సీనియర్ ఇంజినీర్ నర్సింగరావు శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. తహశీల్దార్ హరికిరణ్, సర్వేయర్ అప్పలస్వామి స్థల వివరాలను మ్యాప్ ద్వారా ఆర్‌డిఒకి వివరించారు. సుమారు కిలోమీటరు పొడవు, 12 మీటర్లు వెడల్పుతో రైల్వే వంతెన నిర్మిస్తున్నట్లు ఆర్‌డిఒ తెలిపారు. ఎవరికి, ఎటువంటి ఇబ్బందీ లేకుండా సర్వే చేసి రైల్వే వంతెన పనులను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు రొంగలి వెంకన్న, సరిత, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వేపాడ పిహెచ్‌సి పరిశీలన

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ పిహెచ్‌సి భవనాన్ని ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, పిహెచ్‌సి వైద్యాధికారి వేణు శుక్రవారం పరిశీలించారు. ఇటీవల ప్రజాశక్తి దినపత్రికలో 'శిథిల భవనంలోనే వైద్య 'సేవలు' కథనం వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై సామాజిక కార్యకర్త రెడ్డి అప్పారావు.. పిజిఆర్‌ఎస్‌లో కలెక్టర్‌కు వినతి అందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఎంపిడిఒ, వైద్యాధికారి శిథిలావస్థకు చేరిన భవనాన్ని పరిశీలించి, మరమ్మతులకు అంచనాలు వేశారు. అవసరమైన నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌కు నివేదిక పంపించినట్టు ఎంపిడిఒ తెలిపారు.

పెచ్చులూడుతున్న స్లాబ్‌ను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలి

ప్రజాశక్తి-బొండపల్లి

స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస్ పాణి అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏర్పాటుచేసిన స్వయం సహాయక సంఘాల సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ ద్వారా సంఘాల స్వావలంబనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎపిఎం కె.పెంటం నాయుడు పాల్గొన్నారు.

సమయపాలన పాటించకపోతే కఠిన చర్యలు

ప్రజాశక్తి - బొబ్బిలి

సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి హెచ్చరించారు. పట్టణంలోని పూల్‌బాగ్, కుమ్మరివీధి సచివాలయాలను శుక్రవారం సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. వార్డుల్లో సమస్యలు గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. వర్క్ ఫ్రం హోం ఉద్యోగుల కోసం సచివాలయాల్లో నిర్వహిస్తున్న కౌశలం పరీక్షలను పరిశీలించారు.



సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న కమిషనర్ రామలక్ష్మి

పోస్టల్ పథకాలను ప్రజలకు చేరువ చేయాలి

ప్రజాశక్తి- మెంటాడ

పోస్టల్ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని గజపతినగరం సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర అన్నారు. మండలంలోని చల్లపేట సబ్ పోస్టాఫీసు వద్ద మెంటాడ, చల్లపేట సిబ్బందితో సమావేశం నిర్వహించి, సూచనలు చేశారు. కార్యక్రమంలో సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలో రాబందకు వెళ్లే మార్గంలో ఎస్‌ఐ కె.సీతారాం శుక్రవారం ఆకస్మికంగా వాహన తనిఖీలు చేపట్టారు. వాహన పత్రాలను, డ్రైవింగ్ లైసెన్సులను పరిశీలించారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఎస్‌ఐ తెలిపారు.

పూసపాటిరేగలో 'క్యూబ్ ఫ్యాషన్స్' ప్రారంభం

ప్రజాశక్తి -పూసపాటిరేగ

మండలంలోని కోనాడ జంక్షన్ వద్ద ఏర్పాటైన క్యూబ్ ఫ్యాషన్స్ షాపును శుక్రవారం ఎమ్మెల్యే లోకం నాగమాధవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతకు ఉపాధి, వ్యాపార అవకాశాలను పెంపొందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో క్యూబ్ ఫ్యాషన్స్ యజమాని కొప్పుశెట్టి చైతన్య, మురళీధర్ పాల్గొన్నారు.

సుస్థిర వ్యవసాయ విధానాలపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

సుస్థిర వ్యవసాయ విధానాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని గాజులరేగ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త వై.సంధ్యారాణి అన్నారు. ప్రపంచ మట్టి దినోత్సవం సందర్భంగా శుక్రవారం సెంచూరియన్ స్కూల్ ఆఫ్ స్మార్ట్ అగ్రికల్చర్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ విద్యార్థులకు మట్టి ఆరోగ్యం, సంరక్షణ పద్ధతులు, సుస్థిర వ్యవసాయ విధానాలపై ఆమె సూచనలు చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ వేద, డాక్టర్ పుష్పలత, డాక్టర్ అనీల్ కుమార్ పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని సోంపురం, ఓబులయ్యపాలెం గ్రామాల్లో శుక్రవారం ప్రపంచ నేల దినోత్సవాన్ని నిర్వహించారు. నేల సంరక్షణపై ప్రకృతి వ్యవసాయం రీజనల్ అధికారి ప్రకాశ్ రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిఎస్‌ఎ వెంకటరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

సతివాడ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని టౌన్ డిఇఇ పి.త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. అలుగోలు, చనమల్లపేట, జోగిరాజుపేట, కొత్తూరు, పల్లిపేట, గుషిణి, బర్లపేట, రాగోలు వ్యవసాయ కనెక్షన్లకు, అలుగోలు, గుషిణి, జోగిరాజుపేట, కొత్తూరు, పల్లిపేట, బర్లపేట గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని చెప్పారు.

తాగునీటి బోరుకు భూమిపూజ

ప్రజాశక్తి-దత్తిరాజేరు

దత్తిరాజేరు హైస్కూల్లో హెచ్‌ఎం శశికళ ఆధ్వర్యంలో తాగునీటి బోరుకు శుక్రవారం ఎంపిపి సింహాద్రి అప్పలనాయుడు, వైస్ ఎంపిపి మిత్తిరెడ్డి రమేష్ నాయుడు భూమిపూజ చేశారు. మండల పరిషత్ నిధులు రూ.1.50 లక్షలతో బోరు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపిపి తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మహాదేవ ఫణీంద్ర, గర్భాపు శ్రీనివాస్ రెడ్డి, సింహాచలం, జమ్ము నారాయణరావు పాల్గొన్నారు.

7న నవోదయలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఈ నెల ఏడో తేదిన కిల్తంపాలెం జవహర్ నవోదయలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ వి.దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏటా మాదిరిగా డిసెంబర్ నెల మొదటి ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పూర్వ విద్యార్థులందరినీ ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.

మరుగుదొడ్ల నిర్వహణ కాంట్రాక్టుకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరంలీగల్

జిల్లాలోని వివిధ కోర్టు కాంప్లెక్సులలో ఆధునిక పద్ధతులు, పరికరాలు ఉపయోగించి వాష్‌రూమ్‌లను శుభ్రం చేయడానికి వార్షిక నిర్వహణ కాంట్రాక్ట్ కోసం సీల్డ్ టెండర్‌లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత ఒక ప్రకటనలో తెలిపారు. పని పరిధిలో 178 వాష్ రూమ్‌లుకు 18 మంది క్లినింగ్ సిబ్బందిని కేటాయించాలని, వీటితో పాటు కొనసాగుతున్న నిర్మాణాల కారణంగా పెరిగే వాష్‌రూమ్‌లు కూడా చేరుతాయని తెలిపారు. విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, చీపురుపల్లి, గజపతినగరం, కొత్తవలస, శృంగవరపుకోట, సాలూరు, కురుపాం కోర్టు కాంప్లెక్సులలో 178 వాష్ రూములకు 18 మంది సిబ్బందిని కేటాయించవలసి వుంటుందని, ఆసక్తి, అర్హత కలిగిన బిడ్డర్లు తమ సీల్డ్ కొటేషన్లను, వారి కాంప్లెక్స్ రికార్డుతో (ఏమైనా ఉంటే) కలిపి, ఈనెల 15న సాయంత్రం 5గంటల లోపు అందజేయాలని తెలిపారు.

రేపు హిందీ మంచ్ జిల్లాశాఖ ఎన్నికలు

విజయనగరం టౌన్ : హిందీ భాషాభిమానుల వేదిక హిందీ మంచ్ సంస్థ విజయనగరం జిల్లాశాఖ కార్యవర్గ నూతన ఎన్నికలు హిందీ మంచ్ ఉత్తరాంధ్ర శాఖ కార్యదర్శి కోనే శ్రీధర్ ఆధ్వర్యంలో ఈనెల 7న జరగనున్నట్టు హిందీ మంచ్ జిల్లాశాఖ ప్రతినిధులు పి.ఉమాబాల, ఏలూరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10:30 గంటలకి పూల్ బాగ్ లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ దరిగల సరస్వతి శిశు మందిర్ లో సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

పాఠశాలల్లో సందడి

మెగా పేరెంట్, టీచర్ సమావేశాల సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో శుక్రవారం సందడి వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని, విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర ప్రాధాన్యతను తెలియజేశారు.

పూసపాటిరేగ.. విద్యార్థులతో కలిసిన భోజనం చేస్తున్న ఎమ్మెల్సీ చిరంజీవులు

కొత్తవలస.. ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

విజయనగరంకోట.. విద్యార్థుల యోగాసనాలను తిలకిస్తున్న ఎమ్మెల్యే అదితి

నెల్లిమర్ల.. మెగా పిటిఎంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు

వంగర.. మెగా పిటిఎంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ

డెంకాడ.. మెగా పిటిఎంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

స్క్రబ్ టైఫస్‌పై ప్రజల్లో అవగాహన పెంచాలి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

స్క్రబ్ టైఫస్‌పై ప్రజల్లో అవగాహన పెంచాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. ఆరోగ్యశాఖతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్ లో కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ప్రజల్లో అనవసర భయాందోళనలు రాకుండా తగిన అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో వ్యాధి పరిస్థితిని సమీక్షించారు. స్క్రబ్ టైఫస్ అనేది సమయానికి గుర్తిస్తే పూర్తిగా నయం అయ్యే వ్యాధి అని, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ వ్యాధి లక్షణాల గురించి గ్రామ, వార్డు స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జ్వరం, శరీర నొప్పులు, అలసట, చర్మంపై చిన్న గింజల్లాంటి గాయాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరీక్ష చేయించుకోవడం అత్యంత ముఖ్యమని కలెక్టర్ వివరించారు. వ్యాధి కేసులు నమోదైతే, ఆయా ప్రాంతాల్లో వెంటనే క్షేత్ర పరిశీలన చేసి పరిస్థితిని పర్యవేక్షించాలని ఆదేశించారు.

తెర్లాం : స్క్రబ్‌టైఫస్‌పై అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ రాంబాబు తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం తెర్లాం, పెరుమాళి పిహెచ్‌సిల వైద్యులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఒ సుశీల, వైద్యులు పాల్గొన్నారు.

వేపాడ : స్క్రబ్‌టైఫస్‌పై ఎంఇఒలు, వైద్యులు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ, డిప్యూటీ ఎంపిడిఒ, సచివాలయ సిబ్బందితో ఆన్‌లైన్‌లో ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ సమావేశం నిర్వహించారు. ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

పూసపాటిరేగ : మండలంలోని భరణికం గ్రామంలో రైతులకు నైస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్క్రబ్ టైఫస్ వైరస్‌పై అవగాహన, హెల్త్ ఎడ్యుకేషన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు.

మెరకముడిదాం : గర్భాం పిహెచ్‌సి వైద్యులు అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో స్క్రబ్ టైఫస్‌పై పిహెచ్‌సిలో అవగాహన కల్పించారు.

సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి-గంట్యాడ

అంగన్వాడీలు సమయపాలన పాటించాలని ఐసిడిఎస్ పీడీ విమలరాణి సూచించారు. మండలంలోని కొటారుబిల్లి జంక్షన్‌లో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని శుక్రవారం పీడీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు క్షుణంగా తనిఖీ చేశారు. చిన్నారుల కోసం వండిన ఆహార పదార్థాలు రుచి చూశారు. కార్యక్రమంలో పిఒ ఉమాభారతి పాల్గొన్నారు.

అంగన్వాడీ సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ

పోలీస్‌స్టేషన్ పరిధికి బోర్డులు ఏర్పాటు

నెల్లిమర్ల : నెల్లిమర్ల పోలీస్ స్టేషన్ పరిధికి శుక్రవారం బోర్డులు ఏర్పాటు చేశారు. ఎస్‌ఐ బి.గణేష్ మాట్లాడుతూ నేరం జరిగిన వెంటనే అది ఏ స్టేషన్ పరిధిలోకి వస్తుందో ప్రజలు సులభంగా గుర్తించడానికి ఈ సూచన బోర్డులు ఉపయోగపడతాయని తెలిపారు.

సిఐటియు మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 31 నుంచి విశాఖలో జరుగనున్న సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు నగర ఉపాధ్యక్షులు, కళాసీ సంఘం గౌరవ అధ్యక్షులు రెడ్డి శంకరరావు, నగర కార్యదర్శి బి.రమణ పిలుపు నిచ్చారు. శుక్రవారం డాబాతోటలోని ట్రాన్స్‌పోర్టు కార్మికులతో జరిగిన కార్యక్రమంలో కరపత్రం విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించిన 8 గంటల పని హక్కులు, భారత కార్మిక వర్గం ప్రాణత్యాగాలు చేసి సాధించిన 29 కార్మిక చట్టాలను నేడు మోడీ ప్రభుత్వం రద్దుచేసి కార్మికద్రోహిగా మారిందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చి యాజమాన్యానికి, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న నేపథ్యంలో, ప్రభుత్వ రంగం లో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేట్ పరం చేసి పూర్తిగా రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేస్తున్న సందర్భంలో జరుగుతున్న ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. జనవరి 4న జరిగే మహా ప్రదర్శన, ఆర్‌కె బీచ్‌లో జరిగే బహిరంగ సభలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మేస్త్రీలు గోవింద్, తాడ్డి రమణ తది తరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ రఘురాజు

పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలో దేవీ ఆలయం ఎదురుగా ఉన్న గాంధీ పార్కులో అభివృద్ధి పనులకు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు శుక్రవారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ గనివాడ సంతోషి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు , వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాణి, ఎంపిటిసిలు మజ్జి దేవి, వాకాడ సింహాచలం, పిఆర్ జెఇ సత్యనారాయణ, ఇఒ అనురాధ, నాయకులు కారుకొండ వెంకటరావు, మోపాడ గౌరినాయుడు, మజ్జి గంగరాజు పాల్గొన్నారు.

సౌమ్యకు ధ్రువపత్రం అందజేస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి

రన్నింగ్‌లో గురుకుల విద్యార్థి సత్తా

ప్రజాశక్తి-వేపాడ

బక్కునాయుడుపేట వద్దనున్న గురుకులంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జి.సౌమ్య రాష్ట్ర, జాతీయ స్థాయి పరుగు పోటీల్లో సత్తాచాటింది. దీంతో శుక్రవారం జరిగిన మెగా పేరెంట్, టీచర్ సమావేశంలో విద్యార్థినికి ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, ఎంపిపి సత్యవంతుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, ఎంఇఒలు ధ్రువపత్రాలను అందజేసి, అభినందించారు.

గ్రామాల్లో ప్రత్యేకాధికారి పర్యటన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలోని మొయిద విజయరాంపురం, కొండగుంపాంతోపాటు నెల్లిమర్ల నగర పంచాయతీలో మండల ప్రత్యేకాధికారి జి.మురళీమోహన్ శుక్రవారం పర్యటించారు. అక్కడి సచివాలయాలను సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. మొయిదలో ఆవాస్ సర్వేను పర్యవేక్షించారు. కొండగుంపాం మెగా పేరెంట్స్ మీటింగ్‌లో ప్రత్యేకాధికారి పాల్గొన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ ఆర్.పవన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వంగర మండల సమావేశం

ప్రజాశక్తి-వంగర

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ టి.రాజారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి సురేష్ ముఖర్జీ అధ్యక్షతన జరిగే సమావేశానికి సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

కెజిబివికి కుట్టుమిషన్ వితరణ



కుట్టుమిషన్‌ను అందజేస్తున్న జనసేన నేత కోట్ల రఘు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

కెజిబివి విద్యార్థుల కోసం కొవ్వాడ సర్పంచ్, జనసేన నేత కోట్ల రఘు రూ.10 వేలు విలువైన కుట్టుమిషన్‌ను శుక్రవారం అందజేశారు. వృత్తి విద్యా టీచర్ అనురాధతోపాటు ఎస్‌ఒ ఎ.భారతికి కుట్టుమిషన్‌ను అందించారు. అధ్యాపకులు చేసిన వినతి మేరకు 80 మంది విద్యార్థులకు కుర్చీలు, ప్లాంకులు త్వరలో అందజేస్తానని ఆయన హామీఇచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.వి.రమణ, ఆర్‌ఐ మాధురి, ఎస్‌ఐ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఎపిఎన్‌జిఒ గజపతినగరం తాలూకా కార్యవర్గం ఎన్నిక

ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌జిఒలు

ప్రజాశక్తి-గజపతినగరం

ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ గజపతినగరం తాలూకా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక ఎన్‌జిఒ హోంలో శుక్రవారం ఎన్నికల అధికారి జె. విక్టర్, సహాయ ఎన్నికల అధికారి ఎ.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యాన ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షులుగా ఎం.పైడన్న, అసోసియేట్ అధ్యక్షులుగా కె.స్వామికుమార్, కార్యదర్శిగా ఎం.రమణ, కోశాధికారిగా జె.వి.అప్పలరాజు, మహిళా ఉపాధ్యక్షులుగా పి.నందిని ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా ఎం. శ్రీనివాసరావు వ్యవహరించారు. అనంతరం ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు టి.శ్రీధర్ బాబు, కార్యదర్శి ఎ.సురేష్ పాల్గొన్నారు.

8 నాటికి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు ప్రక్రియ పూర్తి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అక్రమ లే అవుట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియకు వచ్చిన దరఖాస్తులు సోమవారం నాటికి అప్ లోడ్ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య టౌన్ ప్లానింగ్ కార్యదర్శులకు ఆదేశించారు. శుక్రవారం ఎల్‌ఆర్‌ఎస్, బి పి ఎస్ పై అవగాహన కల్పించారు. ఎల్ ఆర్ ఎస్, బిపిఎస్ స్కీమ్ లు గురించి ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నిర్లక్ష్యం కొనసాగుతుందన్నారు. ప్రధానంగా లైసెన్స్ టెక్నికల్ పర్సనల్‌లు ప్రధాన భూమిక వహించాలన్నారు. నగరంలో ఇప్పటికే అనధికార లే అవుట్లు 60 వరకు రెగ్యులర్ చేసుకునేందుకు దరఖాస్తులు వచ్చాయని, వెంటనే ఆన్‌లైన్ పూర్తి చేయాలని అన్నారు. ప్రణాళిక విభాగం అర్‌డి డి చామంతి మాట్లాడుతూ ఎల్‌ఆర్ ఎస్, బిపిఎస్‌పై కింది స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎసిపిలు ఐవి రమణమూర్తి, హరిబాబు, బొబ్బిలి, నెల్లిమర్ల, విజయనగరం మున్సిపల్ కార్యదర్శులు, ఎల్‌టిపిలు పాల్గొన్నారు.

స్క్రబ్ టైఫస్ ప్రబలకుండా చర్యలు : కమిషనర్

నగరంలో స్క్రబ్ టైఫస్ వ్యాధి ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజారోగ్య సిబ్బందికి, కార్యదర్శులకు కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. ఈ మేరకు టెలి కాన్ఫరెన్స్ ద్వారా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనుమానిత కేసులు ఉన్నట్లయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రేపిడ్ పరీక్షలు చేయించాలని, 60 నుండి 70 శాతం పాజిటివ్ కేసుగా నిర్ధారణ అయితే తక్షణమే జిల్లా కేంద్ర ఆసుపత్రికి రోగిని తరలించాలన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే ధ్యేయం

ప్రజాశక్తి-తెర్లాం

డ్రగ్స్ రహిత సమాజమే ప్రభుత్వ ధ్యేయమని ఎఎంసి చైర్మన్ ఎన్.వెంకటనాయుడు తెలిపారు. పోలీసు శాఖ చేపట్టిన అభ్యుదయం సైకిల్ యాత్ర శుక్రవారం తెర్లాం మండలానికి చేరుకుంది. ఎస్‌ఐ సాగర్‌బాబు ఆధ్వర్యాన పెరుమాళిలో నిర్వహించిన ర్యాలీని వెంకటనాయుడు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ మోడల్ స్కూల్ వరకు సాగింది. అనంతరం విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిఐ నారాయణరావు, ఎంఇఒ త్రినాథరావు, తహశీల్దార్ జి.హేమంత్‌కుమార్, ప్రిన్సిపల్ జ్యోతిలక్ష్మి, ఎస్‌ఎంసి చైర్మన్ రామినాయుడు, అప్పలరాజు, జగన్నాథరాజు పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న ఎఎంసి చైర్మన్ వెంకటనాయుడు

టార్చ్ ఫిన్టెక్ కంపెనీతో జెఎన్‌టియు ఒప్పందం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు గురజాడ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లోని టార్చ్ ఫిన్టెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మధ్య శుక్రవారం అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా విశ్వవిద్యాలయ విద్యార్థులకు పరిశ్రమ ఆధారిత నైపుణ్యాలు, స్వయం కోర్సులు, స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ ప్రోగ్రామ్‌లు అందించనున్నారు. ఈ భాగస్వామ్యంలో భాగంగా విద్యార్థులకు ఇంటరాక్టివ్ సెషన్స్ మరియు సీడాప్ లింకేజ్, మెంటర్‌షిప్, స్టార్టప్‌ల కోసం బ్యాంక్ లింకేజెస్ వంటివి ఉచితంగా అందించనున్నారు. ఈ సేవలకు కావాల్సిన నిధులు భారత ప్రభుత్వ ఎం ఎస్ ఎం ఈ విభాగం ద్వారా సమకూరుతున్నాయని అధికారులు తెలిపారు.కార్యక్రమంలో జెఎన్‌టియు విసి వి.వి. సుబ్బారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. జయసుమ, టార్చ్ ఫిన్టెక్ మేనేజింగ్ డైరెక్టర్ వైభవ్ సీపాన, యూనివర్సిటీ డైరెక్టర్లు ప్రొఫెసర్ చంద్రభూషణరావు, ప్రొఫెసర్ జి.స్వామినాయుడు, ప్రొఫెసర్ కె.బాబు, తదితరులు పాల్గొన్నారు.

14న వెటరన్ బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా వెటరన్ బాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 14న నగరంలోని ఇండోర్ బాడ్మింటన్ స్టేడియంలో నిర్వహిస్తామనిజిల్లా బాడ్మింటన్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కెవి నాయుడు, ఎన్.సురేష్ తెలిపారు. శుక్రవారం ఇండోర్ స్టేడియంలో జరిగిన విలేకర్ల సమావేశంలో వారు టోర్నమెంట్ వివరాలు వెల్లడించారు. పోటీలు 35, 40, 45, 50, 55, 60, 65o, 70, 75 కేటగిరీలలో సింగిల్స్, డబుల్స్, మిక్సిడ్ డబుల్స్ పోటీలు మహిళలకు, పురుషులకు వేర్వేరుగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ పోటీలకు ఉమ్మడి విజయనగరం జిల్లా క్రీడాకారులందరూ అర్హులని తెలిపారు. అర్హత గల వారు ఈనెల 9 నాటికి వారి పేర్లను సింగిల్స్‌కు రూ.750, డబుల్స్‌కు రూ.1500 చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో విజయనగరంలో జరుగబోవు రాష్ట్ర బాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు.

మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-వేపాడ

ఎన్‌కెఆర్‌పురంలో శుక్రవారం మెగా వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరాన్ని తహశీల్దార్ జె.రాములమ్మ సందర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.దేవి, బి.రామినాయుడు, టిడిపి మండల ఉపాధ్యక్షులు పి.రమణ, ఎస్‌ఎంసి చైర్‌పర్సన్ సత్యవతి పాల్గొన్నారు.

'ఉపాధి' కల్పించకపోతే ఉపేక్షించేది లేదు

డ్వామా పీడీ శారదాదేవి

ప్రజాశక్తి-వంగర

గ్రామాల్లో కూలీలు, చిన్న, సన్నకారు రైతులకు అవసరమైన పనులు కల్పించకపోతే ఉపేక్షించేది లేదని డ్వామా పీడీ ఎస్.శారదాదేవి ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు కల్పించడంలో వంగర మండలం జిల్లాలో వెనుకంజలో ఉందని అసంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఎపిఒ సత్యవతి పాల్గొన్నారు.

వాలీబాల్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-డెంకాడ

జెఎన్‌టియుజివి అంతర కళాశాలల వాలీబాల్ జట్టు ఎంపిక పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జెఎన్‌టియుజివి వైస్ ఛాన్సలర్ వి.వి.సుబ్బారావు ప్రారంభించారు. ఈ నెల పదో తేది నుంచి కాకినాడ జెఎన్‌టియులో జరిగే అంతర యూనివర్సిటీ పోటీలకు జట్టును ఎంపిక చేయనున్నట్లు విసి వివరించారు. కార్యక్రమంలో క్రీడా సమన్వయకర్త డాక్టర్ జి.అప్పలనాయుడు. విశ్వవిద్యాలయ పరిశీలకులు కె.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానానికి రోడ్డు సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి-కొత్తవలస

శ్మశానవాటికకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కొత్తవలసకు చెందిన ముస్లిములు లక్కవరపుకోటలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి శుక్రవారం వినతి అందించారు. రహదారి సౌకర్యం లేక మురుగు కాలువ గుండా వెళ్లి ప్రమాదకర పరిస్థితుల్లో దహన సంస్కారాలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- కంటోన్మెంట్

ప్రేమించిన యువతితో పెళ్లి చేస్తామని చెప్పినప్పటికీ ఇంతలోనే ఏమైందో ఏమో గాని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ పోలీసులు కథనం ప్రకారం.. విజయనగరంలోని దాసన్నపేట గొల్ల వీధిలో కోరాడ శ్రీనివాసరావుకు కుమారుడు వీరేంద్ర (25), ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరేంద్ర ఓ ప్రైవేట్ షాపులో క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. గొల్లవీధిలోనే తమ ఇంటికి సమీపంలో ఉన్న ఒక యువతని ప్రేమించాడు. పెళ్లి చేయాలని కుటుంబ సభ్యులకు తెలిపాడు. ఇద్దరు అక్కలకు పెళ్లి అయ్యాక ప్రేమించిన అమ్మాయితో పెళ్లి చేస్తామని తల్లిదండ్రులు ఆ యువకుడికి తెలిపారు. ఇదే విషయాన్ని ఆ యువతి తల్లిదండ్రులకు కూడా వీరేంద్ర కుటుంబ సభ్యులు తెలిపారు. ఏమైందో ఏమోగానీ గురువారం రాత్రి 10 గంటలకు భోజనం చేసి మేడపైన రూములో పడుకోవడానికి వెళ్ళాడు. ఉదయం తన స్నేహితుడు వచ్చి తలుపు కొట్టేసరికి లేవలేదు. దీంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు స్నేహితుడు పక్క మేడ పైనుంచి గదిలోకి చూశారు. ఫ్యాన్ కు చీర తో ఉరిపోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు .పోలీసులకు సమాచారం అందించడంతో స్థలానికి విజయనగరం టూ టౌన్ ఎస్‌ఐ ఎస్.కృష్ణమూర్తి వచ్చి పరిశీలించారు. మృతుడి తండ్రి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఐ టి.శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలోని పురిటిపెంట గ్రామ సమీపంలో సమన్విత స్కూలు సమీపంలో గల లే అవుట్‌లో నిల్వ ఉంచిన ఇసుకను తరలిస్తుండగా ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కొద్దిరోజులుగా కొందరు ఎడ్ల బళ్లతో చంపావతి నదిలో ఇసుకను ఈ లేఅవుట్‌లోకి తరలించి, అక్కడ నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు విక్రయిస్తున్నారు. ఈనేపథ్యంలోనే గంట్యాడ మండలం బుడతనాపల్లి గ్రామానికి చెందిన కె. అప్పలనాయుడు ఆదివారం సాయంత్రం ట్రాక్టర్‌లో ఇసుకను లోడ్ చేసి, పైకి ఎక్కి లెవెల్ చేస్తుండగా పైనున్న విద్యుత్తు వైర్లు తగిలి షాక్‌కు గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ కిరణ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తండ్రి మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అప్పలనాయుడుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

CHANGE OF DATE OF BIRTH

I, No: 16122656M, Rank L/Nk, Name: **SACHIN R,** S/o. RAVEENDRAN T, age: 32 years, residing at Sachinsadanam, Ottakkal P.O Thenmala, Kollam, Kerala Pin:691308. **RAVEENDRAN T & NOORJA BEEVI** is my parents. In my NOK records My father's (RAVEENDRAN T) date of birth is wrongly recorded as **15/02/1961** instead of **15/05/1962** & My Mother's (NOORJA BEEVI) Date of Birth is wrongly recorded as **15/05/1967** instead of **23/05/1967** My father's correct date of birth is **15/05/1962** and my mother's correct date of birth is **23/05/1967** vide affidavit dated 31/07/2025

మహారాజశ్రీ పెద్దాపురం సివిల్(సీనియర్ డివిజన్) జడ్జివారి కోర్టులో

I.A.No.495/2024 OS.No.273/2018

సుర్ల ముత్యాల నాయుడు ...అప్పిలెంట్

వరియు

వొమ్మి నాగమణి వగైరా ...రెస్పాండెంట్స్

R2. పుర్రి అనుసూర్యాదేవి భర్త తాతారావు, గృహిణి, డోర్‌నెం.15-1-24(2) పూల్బాగ్‌రోడ్ రెవిన్యూవర్డ్స్ నెం.15 విజయనగరం.

పై నంబరు అప్పీల్ మరియు స్టే పిటిషన్‌లో మీకు ఎన్నిమార్లు నోటీసులు పంపినను మీరు కాలయాపన చేయ ఉద్దేశ్యముతో తీసుకొనకుండా త్రిప్పివేయుచన్నారు. పై నంబరు గ్రంథము శ్రీకోర్టువారి ఆర్డర్ ప్రకారము ది.18-12-2025సం॥ తేదికి వాయిదా అయివున్నది. కాబట్టి మీరు **ది.18-12-2025సం॥** తేదిన ఉదయం **గం.10.30ని॥ల** లగాయతు స్వయముగా గాని ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీ వాదనను తెలుపుకోవలయును. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానము చేయుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

T.SATYANARAYANA
Advocate, Peddapuram
Cell.9885657091

మహారాజశ్రీ పెద్దాపురం సివిల్(సీనియర్ డివిజన్) జడ్జివారి కోర్టులో

OS.No.273/2018

సుర్ల ముత్యాల నాయుడు ...అప్పిలెంట్

వరియు

వొమ్మి నాగమణి వగైరా ...రెస్పాండెంట్స్

R2. పుర్రి అనుసూర్యాదేవి భర్త తాతారావు, గృహిణి, డోర్‌నెం.15-1-24(2) పూల్బాగ్‌రోడ్ రెవిన్యూవర్డ్స్ నెం.15 విజయనగరం.

పై నంబరు అప్పీల్‌లో మీకు ఎన్నిమార్లు నోటీసులు పంపినను మీరు కాలయాపన చేయ ఉద్దేశ్యముతో తీసుకొనకుండా త్రిప్పివేయుచన్నారు. పై నంబరు గ్రంథము శ్రీ కోర్టువారి ఆర్డర్ ప్రకారము ది.18-12-2025సం॥ తేదికి వాయిదా అయివున్నది. కాబట్టి మీరు **ది.18-12-2025సం॥** తేదిన ఉదయం **గం.10.30ని॥ల** లగాయతు స్వయముగా గాని ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీ వాదనను తెలుపుకోవలయును. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానము చేయుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

T.SATYANARAYANA
Advocate, Peddapuram
Cell.9885657091